సాక్షి
నిర్మల్

1

బుధవారం • 9 • అక్టోబర్ • 2024



డీఆర్డీవో ఆధ్వర్యంలో తయారు చేసిన బతుకమ్మలు

నిర్మల్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ అభిలాష అభినవ్ ముఖ్యఅతిథిగా హాజరైన బతుకమ్మకు పూజలు చేసి వేడుకలు ప్రారంభించారు. మహిళా ఉద్యోగులతో కలిసి కాసేపు బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతికే అందం మన బతుకమ్మ సంబురమని అన్నారు. జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మి, సీడీపీవో నాగమణి, డ్వాక్రా గ్రూప్ మహిళలు, వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

– నిర్మల్ చైన్‌గేట్

బతుకమ్మ సంబరం



బతుకమ్మలతో కలెక్టర్ అభిలాష అభినవ్, డీఆర్డీవో విజయలక్ష్మి, అదనపు కలెక్టర్లు..

న్యూస్‌రీల్

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ఆర్థిక సామాజిక ముఖచిత్రం 2024 పుస్తకాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్లోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జీవరత్నం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రజల పార్టీ

- బీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ దేశ రక్షణ కోసం పనిచేస్తుందని, ఇది ప్రజల పార్టీ అని బీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. ప్రజలు స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. నరేంద్ర మోదీ పదేళ్ల పాలనలో దేశం ప్రగతిపథంలో దూసుకెళ్తుందన్నారు. కరోనా కష్టకాలంలో ప్రపంచ దేశాలు చేతులెత్తేసినప్పుడు భారతదేశం వ్యాక్సిన్‌ను తయారు చేసి మన దేశానికే కాకుండా ప్రపంచ దేశాలను ఆదుకుందన్నారు. రాబోయే కాలంలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, బీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆకుల కార్తీక్, నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండాజి నరేంద్రచారి, బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తోట సత్యనారాయణ, నిర్మల్ పట్టణ అధ్యక్షుడు రాకేశ్, సీనియర్ నాయకుడు పొన్నం నారాయణగౌడ్ పాల్గొన్నారు.

నీటి సరఫరాలో సమస్యలు పరిష్కరించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

లోకేశ్వరం: గ్రామాల్లో మంచినీటి సరఫరాలో చిన్న సమస్యలు వస్తే గ్రామంలోనే పరిష్కరించుకోవాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. లోకేశ్వరంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న మంచినీటి సహాయకుల శిక్షణ తరగతులకు మంగళవారం హాజరై మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులుగానీ, మంచినీటి సహాయకులుగానీ జాగ్రతగా పని చేసుకోవాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేయాలని తెలిపారు. శిక్షణ పూర్తికాగానే ధ్రువ పత్రాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఈఈ సందీప్, డీసీ లక్ష్మీనారాయణ, వాటర్ గ్రిడ్ ఏఈ సుమన్, ఎంపీడీవో వెంకటరమేశ్, ఎంపీఈవో సోలమాన్‌రాజ్ పాల్గొన్నారు.

పీఆర్టీయూ అసోసియేట్ అధ్యక్షుడిగా వేణు



కోట వేణు

దస్తురాబాద్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కోట వేణును పీఆర్టీ యూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. శామీర్‌పేటలో మంగళవారం జరిగిన యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈమేరకు నియామకం జరిగిందని జిల్లా అధ్యక్షుడు తోట నరేంద్రబాబు, బీవీ.రమణారావు తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నియమితులైన వేణును మండల నాయకులు వెంకటనరసింహారావు, వెంకటనారాయణ, ఎంఈవో గంగాధర్ అభినందించారు.

రాష్ట్ర కార్యవర్గంలో చోటు

లోకేశ్వరం: హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పీఆర్టీయూ కార్యవర్గంలో లోకేశ్వరం మండల ఉపాధ్యాయులకు చోటు లభించిందని అధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాజారాం తెలిపారు. అసోసియేట్ ప్రెసిడెంట్లుగా మల్కాగౌడ్, సురేశ్‌రావు, సదానందం, బర్ల చిన్నయ్య, శ్రీధర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, సంజీవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా దేవేందర్, దేవేందర్ రెడ్డి, నారాయణ, లాల్ గంగాధను నియమించారు.

మూలా నక్షత్ర పూజకు సిద్ధం



- వివరాలు 2లో

కొత్త గురువులొస్తున్నారు..



ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

- డీఎస్సీలో 342 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్..
- 1:3 పద్ధతిలో సర్టిఫికెట్ల పరిశీలన
- 278 పోస్టుల భర్తీకి కలెక్టర్ ఆమోదం
- సీఎం చేతుల మీదుగా నేడు నియామక పత్రాలు..

నిర్మల్ రూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు కొత్తసార్లు రానున్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. డీఎస్సీ- 2024 ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టారు. దీంతో జిల్లాలో కొంతమేర బోధన ఇబ్బందులు తొలగనున్నాయి. డీఎస్సీలో మెరిట్ సాధించిన అభ్యర్థులను 1:3 పద్ధతిలో ఎంపిక చేసి వారి ధ్రువీకరణ పత్రాలను ఇప్పటికే పరిశీలించారు. మూడు రోజులు శ్రమించి అధికారులు తుది జాబితా తయారు చేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ అభిలాష అభినవ్ జాబితాకు ఆమోదముద్ర వేశారు. ఎంపికైన వారికి హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం నియామకపత్రాలు అందజేయనున్నారు.

జిల్లాలో పోస్టుల వివరాలు....

ఎస్జీటీలు	236
ఎస్ఏలు	70
భాష ఉపాధ్యాయులు	04
పీఈటీలు	04
ఎస్జీటీలు(ప్రత్యేక ఉపాధ్యాయులు)	23
ఎస్ఏలు (ప్రత్యేక ఉపాధ్యాయులు)	05
మొత్తం	342

జిల్లాలో 342 పోస్టులు..

డీఎస్సీ- 2024 ద్వారా జిల్లాలో 342 పోస్టులు భర్తీ చేయనున్నారు. పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనుంది. ఇందులో ఎస్జీటీ పోస్టులు 236 ఉండగా, స్కూల్ అసిస్టెంట్ 70, భాషోపాధ్యా పోస్టులు 04, పీఈటీలు 04, ప్రత్యేక ఉపాధ్యాయ ఎస్జీటీ పోస్టులు 23, స్కూల్ అసిస్టెంట్ 5 ఉన్నాయి. ఈనెల 1 నుంచి 5 వరకు 1:3 పద్ధతిలో జిల్లాలో మొత్తం 782 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు పిలవగా 746 మంది హాజరయ్యారు. 36 మంది గైర్హాజరయ్యారు. వివిధ కారణాలతో ఐదుగురిని రిజెక్ట్ చేశారు.

తీరనున్న ఎస్జీటీల కొరత..

ఉపాధ్యాయ పోస్టుల భర్తీతో జిల్లాలో ఎస్జీటీల కొరత కొంతమేర తీరనుంది. ఏకోపాధ్యాయ పాఠశాలలకు ఊరట కలుగుతుంది. జిల్లాల వారీగా బదిలీల ప్రక్రియ గత జూన్ మాసంలో జరిగింది. బదిలీ ఉత్తర్వులు అందుకున్నప్పటికీ కొన్నిచోట్ల ఉపాధ్యాయుల కొరతతో ఆయా పాఠశాలల బోధనా సిబ్బందిని డీఈవోలు బదిలీ చేయలేదు. కొత్త ఉపాధ్యాయులు అందుబాటులోకి వస్తే జిల్లాలో ఈ సమస్యకు కొంతమేర పరిష్కారం అవుతుంది. ఇటీవల పదోన్నతులు, బదిలీలను ప్రభుత్వం చేపట్టిన తర్వాత ఎస్జీటీల కొరత జిల్లాలో తీవ్రంగా ఉంది. చాలామందికి పదోన్నతులు రావడం కూడా ఇందుకు కారణం. డీఎస్సీ ప్రకటన వెలువడిన తర్వాత ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించడం, బదిలీ చేయడంతో పెద్ద సంఖ్యలో ఖాళీలు ఏర్పడ్డాయి. ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కొంత మేరకు ఉంటుంది.

278 పోస్టులు భర్తీ..

కొత్త డీఎస్సీ ద్వారా జిల్లాలో 278 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరగనుంది. ఈ మేరకు కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం రాత్రి ఆమోదముద్ర వేశారు. ఇందులో 204 ఎస్జీటీ పోస్టులు, 03 లాంగ్వేజ్ పండితులు, 67 స్కూల్ అసిస్టెంట్, 04 పీఈటీ పోస్టులు భర్తీ కానున్నాయి. 28 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం ఇప్పటికైతే పక్కన పెట్టింది. రోస్టర్ పాయింట్ల ఆధారంగా అర్హులు లేని కారణంగా 64 పోస్టులు మిగిలిపోనున్నాయి. అర్హత సాధించిన అభ్యర్థులను బుధవారం ఉదయం జిల్లా కేంద్రం నుంచి ఏడు బస్సుల్లో హైదరాబాద్‌కు తీసుకెళ్లనున్నారు. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది.

అందుబాటులో మందులు

- నిర్మల్‌లో సెంట్రల్ డ్రగ్ స్టోర్
- మెడికల్ కళాశాలలో ఏర్పాటు
- 57 రకాల మందులు అందుబాటులో..
- ఆస్పత్రులకు మందుల సరఫరాలో జాప్యానికి చెక్



సెంట్రల్ మెడికల్ స్టోర్‌లో అందుబాటులో నిల్వ ఉంచిన మందులు



జిల్లా మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంట్రల్ మెడికల్ స్టోర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులకు ఇక ఎలాంటి జాప్యం లేకుండా మందులు సరఫరా కానున్నాయి. నిర్మల్‌లో జిల్లాకు సెంట్రల్ మెడిసిన్ డ్రగ్ స్టోర్ (సీఎంఎస్/మందుల నిల్వ కేంద్రం) ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఆదిలాబాద్ సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి మందులు సరఫరా అయ్యేవి. జిల్లాల ఏర్పాటు తర్వాత ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య, ఔషధ వినియోగం పెరిగింది. గతంలో నెలలో రెండుసార్లు సెంట్రల్ మెడిసిన్ స్టోర్ నుంచి మందులు తెప్పించుకునే ఆస్పత్రులు.. ఇప్పుడు నాలుగుసార్లు వెళ్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి సరఫరా చేయడంతో డిమాండ్ ఉన్న ప్రాంతాలకు కొరత ఉన్న సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం 33 జిల్లాల్లో సీఎంఎస్‌లు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

స్టాక్ పాయింట్..

మందులు, సర్జికల్ ఐటంల కొరతను తీర్చడంతోపాటు రవాణాపరంగా వెసులుబాటు కల్పించేందుకు సర్కారు సెంట్రల్ మెడిసిన్ స్టోర్ల(స్టాక్ పాయింట్)ను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేస్తోంది. జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ఆవరణలోని సి బ్లాక్‌లో ఈ డ్రగ్ స్టోర్‌ను ఏర్పాటు చేశారు. డ్రగ్ స్టోర్ పర్యవేక్షకులుగా సూపర్‌వైజర్ వేణుగోపాల్, గ్రేడ్-2 ఫార్మ సిస్ట్ డిప్యూటేషన్‌పై బాధ్యతలు అప్పగిస్తూ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో జిల్లా కేంద్రం నుంచి ఆయా ఆస్పత్రులకు అవసరమైన మేర మందులు, సర్జికల్ పరికరాలు పంపించనున్నారు. ఈ సేవలు అందుబాటులోకి వచ్చిన తర్వాత నెల వారీగా ఎన్ని మందులు అవసరమున్నాయి. ఎంత స్టాక్ ఉండాలనే క్లారిటీ ఉంటుంది. దీంతో మందుల కొరతకు చెక్ పెట్టవచ్చు.

అందుబాటులో 57 రకాల మందులు..

ప్రస్తుతం జిల్లా మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంట్రల్ మెడిసిన్ స్టోర్‌లో 57 రకాల మందులు అందుబాటులో ఉంచారు. జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితోపాటు, బైంసా ఏరియా ఆస్పత్రి, 18 పీహెచ్‌సీలు, 3 బస్తీ దవాఖానాలు, 3 కమ్యూనిటీ ఆస్పత్రులకు ఇక్కడి నుంచే మందులు సరఫరా చేస్తారు. హైదరాబాద్ నుంచి నేరుగా ఇక్కడి సెంట్రల్ డ్రగ్స్ స్టోర్‌కు మందులు వస్తాయి. ఇందులో సర్జికల్ పరికరాలు, బ్యాండేజీలు, బెడ్‌షీట్స్ తదితరాలు ఉంటాయి. ఇప్పటి వరకు ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి మందులు సరఫరా అయ్యేందుకు కనీసం నెల రోజులు పట్టేది. ఇప్పుడు నిర్మల్ నుంచే సరఫరా చేస్తారు.

పేదలకు తప్పనున్న తిప్పలు..

అనారోగ్యం బారినపడే గ్రామీణ ప్రజలు సమీపంలోని పీహెచ్‌సీలకు వెళ్తుంటారు. అక్కడ పూర్తిస్థాయిలో మందులు లేక వైద్యులు రాసిచ్చిన చీటీలు తీసుకుని ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసుకునేవారు. వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న మెడికల్ షాపు నిర్వాహకులు అందినకాడికి దోచుకునేవారు. ప్రస్తుతం డ్రగ్ స్టోర్స్ ఏర్పాటు కావడంతో ఈ సమస్యకు పరిష్కారం లభించనుంది. సరఫరాలో జాప్యానికి తెరపడనుంది. ఇండెంట్ పెట్టడమే ఆలస్యం.. మందులు సత్వరమే సరఫరా అవుతాయని అధికారులు చెబుతున్నారు.

ఔషధాల కొరత లేకుండా..

జిల్లా మెడికల్ కళాశాల సి-బ్లాక్‌లో ఏర్పాటు చేసిన డ్రగ్ స్టోర్‌తో ఇతర జిల్లాకు ఇండెంట్ పెట్టనవసరం లేదు. మూడు నెలలకు సరిపడా మందులు అధిక మొత్తంలో స్టోర్ చేసుకోవచ్చు. అలాగే, వివిధ రకాల వ్యాక్సిన్లు, ఇంజక్షన్లు, టాబ్లెట్లు, సర్జికల్ పరికరాలు, శస్త్ర చికిత్సలో, కట్లు కట్టడంలో ఉపయోగించే క్లాత్, దూది, ఇతరత్రా మందులు ఈ స్టోర్ లోనే నిల్వ చేయవచ్చు. ముందులు, ముఖ్యంగా వ్యాక్సిన్లను తగిన ఉష్ణోగ్రతల మధ్య నిల్వ చేసే వీలుంటుంది. ఇందుకు అవసరమైన అత్యాధునిక పరికరాలు, రిఫ్రిజిరేషన్ సౌకర్యాలను కల్పించనున్నారు.

కొరత, రవాణా బాధ తప్పింది..

నిర్మల్ జిల్లాకు సంబంధించి సెంట్రల్ మెడిసిన్ డ్రగ్ స్టోర్‌ను మెడికల్ కళాశాలలోని సి బ్లాక్‌లో ఏర్పాటు చేశాం. గతంలో ఆదిలాబాద్ స్టోర్ నుంచి డ్రగ్స్ తెప్పించుకునే వాళ్లం. ఇక నుంచి మన జిల్లా నుంచే సరఫరా చేయడం జరుగుతుంది. దీంతో మందుల కొరత నివారించడంతోపాటు రవాణా పరంగా దూరభారం, జాప్యం తప్పుతుంది.

– ఆర్.నర్సింహారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, టీజీఎంఎస్ఐడీసీ

ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

- కేంద్రాల్లో రైతులకు వసతులు కల్పించాలి
- ఈ సీజన్ నుంచే సన్నాలకు బోనస్
- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: వరి ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లు, కేంద్రాల ఏర్పాటు, నిర్వహణ తదితర అంశాలపై అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి మంగళవారం సమీక్ష నిర్వహించారు. త్వరగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ వానాకాలం నుంచే ప్రభుత్వం సన్న రకం వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. వ్యవసాయ అధికారులు ప్రభుత్వ బోనస్‌పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సన్న, దొడ్డు రకాలకు వడ్లకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. సన్న రకపు ధాన్యం బస్తాలపై కొనుగోలు కేంద్రం కోడ్ రాయాలని సూచించారు. మిల్లింగ్ సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా సన్న, దొడ్డు రకం ధాన్యపు బస్తాలను వేర్వేరుగా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కేంద్రాల్లో ధాన్యం మద్దతు ధర, నిర్వాహకుల సమాచారం రైతులకు తెలిసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. తాగునీరు, టెంట్, రాత్రి వేళల్లో విద్యుత్ లైటింగ్ సదుపాయాలు కల్పించాలన్నారు. నిర్వాహకులు కేంద్రాల వద్ద అవసరమైన హమాలీలు, సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. ప్యాడి క్లీనింగ్ యంత్రాల ద్వారా ధాన్యం శుభ్రపరిచేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీ కేంద్రంలో తూకం, తేమ, ప్యాడీ క్లీనింగ్ యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తూకం యంత్రాలకు స్టాంపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోళ్లకు సంబంధించి రోజువారీ వివరాలు రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం జిల్లాలోకి రాకుండా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. మొబైల్ చెక్ పోస్టులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మిలర్లు మిల్లింగ్ ప్రక్రియలో అలసత్వం వహించకుండా త్వరగా మిల్లింగ్ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డీఆర్డీవో విజయలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, అధికారులు, మిల్లర్లు, లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు

- రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: అర్హులందరికీ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటుహక్కు కల్పించాలని, ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే ఉమ్మడి మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఓటు హక్కు నమోదుకు నవంబర్ 6వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. ఓటరుగా నమోదు చేసుకోవడానికి పాస్ ఫొటో, ఆధార్ కార్డు, ఓటరు కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం, డిగ్రీ మెమో జిరాక్స్‌తో ఫామ్ 19ను నింపడం ద్వారా, ఆన్‌లైన్‌లో అయితే పోర్టల్‌లో స్కాన్ కాపీలు జత చేయడం ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కోసం అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పెద్ద ఎత్తున అర్హులైన పట్టభద్రులు ఓటుహక్కు పొందాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో రత్నకళ్యాణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూ.6.10 లక్షలతో అమ్మవారికి అలంకరణ

ఖానాపూర్ మండలం తర్లపాడ్ గ్రామంలో దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన దుర్గామాతకు భక్తులు విశేష పూజలు చేస్తున్నారు. వేడుకల్లో భాగంగా నిర్వాహకులు మంగళవారం రూ.6.10 లక్షల కరెన్సీతో అమ్మవారిని అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు.

– ఖానాపూర్



హస్తం గూటికి సోయం, సక్కు?

- అధికార పార్టీలో చేరేందుకు ఆదివాసీ నేతల ప్రయత్నం
- ఆదివారం చేరికకు ఏర్పాట్లు.. చివరి నిమిషంలో వాయిదా
- ఎమ్మెల్సీ దండే విఠల్ నేతృత్వంలో యత్నాలు
- కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్‌సిగ్నల్ కోసం నిరీక్షణ

సాక్షి, ఆసిఫాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పార్టీని బలోపేతం చేయడంపై కాంగ్రెస్ అధిష్టానం దృష్టి సారించింది. ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాల్లో పట్టుసాధించేందుకు ఆ సామాజిక వర్గంలో బలమైన నేతలను ఆకర్షించడంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఆదివాసీ నేతలు మాజీ ఎంపీ సోయం బాపూరావు, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఇద్దరూ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. 2019 నుంచి 2024 వరకు బీజేపీ ఎంపీగా ఉన్న సోయం బాపూరావుకు ఆ పార్టీ టిక్కెట్‌ను నిరాకరించడడంతో గత పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారు. అదే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా గోడం నగేశ్ విజయం సాధించారు. ఆత్రం సక్కు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగి ఓటమి పాలైన సంగతి విధితమే. ఒకప్పుడు ఉపాధ్యాయ వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చిన సోయం బాపూరావు, ఆత్రం సక్కు ప్రస్తుతం రాజకీయ నిరుద్యోగులుగా మారారు. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా ఉన్న ఆదివాసీల తరఫున వాణి వినిపించే నాయకులు అధికార పార్టీలో లేకపోవడంతో వారిని పార్టీలోకి ఆహ్వానించాలని ఎమ్మెల్సీ దండే విఠల్ కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. అధిష్టానం కూడా ఆ దిశగా యోచన చేసి చేరికలకు సుముఖత తెలిపినట్లు సమాచారం.

చివరి నిమిషంలో వాయిదా..

ఎమ్మెల్సీ దండే విఠల్ అధిష్టానాన్ని ఒప్పించడంతో ఈ నెల 6న(ఆదివారం) సోయం బాపూరావు, ఆత్రం సక్కును హస్తం పార్టీలో చేర్పించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిసింది. అయితే చివరి నిమిషంలో చేరికలు వాయిదా పడినట్లు సమాచారం. గతంలో కాంగ్రెస్ నుంచి గెలుపొంది బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తిరిగి పార్టీలోకి తీసుకోవద్దని అధిష్టానం తీర్మానించడమే వాయిదాకు కారణమని తెలుస్తోంది. అయితే ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఆదివాసీ సామాజికవర్గంలో బలమైన నాయకులుగా పేరున్న సోయం బాపూరావు, ఆత్రం సక్కును పార్టీలోకి చేర్చుకోవడం ద్వారా కాంగ్రెస్ పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేయొచ్చనే యోచనలో పార్టీ ముఖ్య నాయకులు ఉన్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని పార్టీ అధ్యక్షుడు, సీఎం దృష్టికి తీసుకెళ్లి ఎలాగైనా అధిష్టానాన్ని ఒప్పించాలని ఎమ్మెల్సీ దండే విఠల్ కోరినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జైనూర్ ఘటనతో ఉమ్మడి జిల్లాలో రగిలిపోతున్న ఆదివాసీలను శాంతింపజేయడం వీరిద్దరితోనే సాధ్యమవుతుందని భావిస్తున్నారు. ఆదేవిధంగా పార్టీపై ఆదివాసీలకు నమ్మకం ఏర్పడుతుందని రాష్ట నేతల దృష్టికి తీసుకెళ్లగా.. వారు పునరాలోచనలో పడినట్లు తెలిసింది. త్వరలోనే ఢిల్లీ పెద్దలతో మాట్లాడి సోయం బాపూరావు, ఆత్రం సక్కును చేర్చుకుంటారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.



సోయం బాపూరావు



ఆత్రం సక్కు

ఇద్దరిదీ ఉపాధ్యాయ వృత్తే..

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం నానుగూడ గ్రామానికి చెందిన సోయం బాపూరావు 1987లో మహదుగూడలో గిరిజన శాఖలో ఉపాధ్యాయుడిగా నియమితుడయ్యారు. వివిధ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తూనే తుడుందెబ్బలో ఆదివాసీ హక్కుల కోసం పోరాటం చేశారు. 2004లో ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి టీఆర్ఎస్ నుంచి బోథ్ ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. 2014లో టీడీపీ నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసి ఓటమి చెందారు. 2019 ఎన్నికల్లో బీజేపీ నుంచి ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందారు. 2024 ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్ ఇవ్వకపోవడంతో మౌనంగా ఉంటున్న ఆయన.. ఆదివాసీ సమావేశాల్లో పాల్గొంటున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఆత్రం సక్కు వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు. 2009 వరకు అదే వృత్తిలో కొనసాగారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో ఓడిపోగా.. 2018లో మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచి ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఆదిలాబాద్ ఎంపీగా పోటీచేసి ఓడిపోయారు.

క్లుప్తంగా

మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరికి జైలు

బెల్లంపల్లిరూరల్: మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులకు కోర్టు జైలుశిక్ష విధించినట్లు బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దీన్ తెలిపారు. మంగళవారం తాళ్లగురిజాల పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎస్సై చుంచు రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో బుధాకలాన్ గ్రామానికి చెందిన సాయి హర్షిత్, శేషి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పర్చగా జడ్జి ముఖేష్ ఇద్దరికి మూడురోజుల జైలుశిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆలయంలో చోరీ

కుంటాల: మండలంలోని ఓలా శివాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. గేటు దూకి ముందుగా హుండీ వైపు వెళ్లగా అనుమానం వచ్చి విగ్రహం ఎక్కి సీసీ కెమెరా వైర్‌ను కట్ చేశాడు. హుండీని రాడ్‌తో పగులగొట్టి అందులో ఉన్న మొత్తాన్ని తీసుకెళ్లాడు. హుండీని పగులగొట్టే క్రమంలో చేతికున్న కడియం కింద జారి పడిపోయింది. ఆలయం శుభ్రం చేసేందుకు వచ్చిన విఠల్ ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న హుండీని గమనించి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై దేవ్‌రావ్ తెలిపారు.

సీటు కోసం యత్నించి గాయాలపాలు..!


గాయాలపాలైన ప్రయాణికుడు

భైంసాటౌన్: బస్సులో సీటు కోసం ఓ ప్రయాణికుడు ప్రయత్నించగా బస్సు ముందు టైర్ కాలిపైకి ఎక్కడంతో తీవ్ర గాయాలైన ఘటన భైంసా బస్టాండ్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పట్టణంలోని నేతాజీనగర్‌కు చెందిన హన్మాండ్లు కుటుంబ సభ్యులతో కలిసి నిర్మల్ వెళ్లేందుకు బస్టాండ్‌కు రాగా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో బస్సులో సీటు ఆపేందుకు యత్నిస్తుండగా టైరు కాలిపైకి ఎక్కడంతో తీవ్ర గాయమైంది. వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి అదృశ్యం

తాంసి: భీంపూర్ మండలంలోని మార్కగూడకు చెందిన వెడ్మ జలపతి (38) జూలై 24న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై కలీం తెలిపారు. ఎవరికైనా కనిపిస్తే 9000938082 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

మూలా నక్షత్ర పూజకు సర్వం సిద్ధం

- నేడు అమ్మవారి జన్మ నక్షత్రం
- భారీగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేసిన అధికారులు

బాసర(ముధోల్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీమాత ఆలయంలో బుధవారం మూలానక్షత్ర పూజలు జరుగనున్నాయి. అమ్మవారి జన్మనక్షత్రం రోజున ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య శ్రీ జ్ఞాన సరస్వతి, మహాలక్ష్మీ, మహాకాళి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉదయం 11 గంటలకు సరస్వతీ పూజ, విశేష మూలా నక్షత్ర పూజలు నిర్వహిస్తారు. ఆలయ ప్రాంగణంలోని అక్షరాభ్యాస మండపంలో తల్లిదండ్రులు తమ చిన్నారులకు ఆలయ అర్చకుల చేత అక్షరాభ్యాసం చేయిస్తారు. ఈ సందర్భంగా కుంకుమార్చన పూజలు నిర్వహించనున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు తెలిపారు. వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు భక్తులకు క్యూలైన్లో తాగునీరు అందించనున్నారు. శ్రీవారి భక్తులతో పాటు నాందేడ్ జిల్లా ఘూడి పుర బాబా జగదీష్ మహరాజ్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత అన్నదానం చేయనున్నారు. ఎస్పీ జానకీషర్మిల ఆదేశాల మేరకు పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గోదావరినది పుష్కర ఘాట్లవద్ద బోటింగ్ సదుపాయం, గజఈతగాళ్లను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం మూడుచోట్ల వాహన పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



వేడుకలకు ముస్తాబైన బాసర ఆలయం

బాసర శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నేడు ఏడవరోజు అమ్మవారు కాలరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. వేకువజామున ఆలయ అర్చకులు, వేద పండితులు వేద మంత్రో చరణాల మధ్య అమ్మవారికి అష్టోత్తర నామార్చన పూజలు నిర్వహించి అమ్మవారికి కిచిడి, వివిధ రకాల కూరగాయాలతో నైవేద్యం సమర్పిస్తారు.

భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు

బాసర: బాసర సరస్వతీమాత ఆలయంలో బుధవారం జరుగనున్న మూలా నక్షత్ర పూజలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. పట్టణంలోని జీఎస్ గార్డెన్‌లో మంగళవారం పోలీసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భక్తులు క్యూలో ఎక్కువ సేపు వేచి ఉండకుండా చూడాలన్నారు. దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందువల్ల నిరంతరం సీసీటీవీ కంట్రోల్ రూంలో సిబ్బంది అనుక్షణం పర్యవేక్షించాలన్నారు. అనంతరం ఆలయ సిబ్బందితో కలసి క్యూలైన్ ఏర్పాట్లు, పార్కింగ్, గోదావరి పుష్కర ఘాట్లను పరిశీలించారు.


మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల


150 రూపాయల ప్రత్యేక అక్షర శ్రీకార మండపం


భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు

ఎన్నికల హామీలు నెరవేరుస్తాం

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం ఆర్కే 5 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా కార్మికులకు లాభాల వాటా పెంచి ఇప్పించామని, కారుణ్య ఉద్యోగాల వయోపరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంచామని, పెర్క్స్‌పై ఆదాయ పన్ను యాజమాన్యం చెల్లించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. కార్మికుల సొంతింటి పథకం అమలు కోసం త్వరలో జరుగబోయే స్ట్రక్చర్ సమావేశంలో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తామన్నారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీతారామయ్య

వేధింపులు తాళలేక యువతి బలవన్మరణం

బెల్లంపల్లిరూరల్: యువకుడి వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై చుంచు రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చాకేపల్లికి చెందిన జక్కం విమల–శంకర్ దంపతుల చిన్న కుమార్తె జక్కం అంజలి (18) కూలీ పనులకు వెళ్తూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటోంది. మూడేళ్ల క్రితం భీమిని మండలం చిన్న గుడిపేటకు చెందిన యాటకార్ల రాజుతో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమెతో చనువుగా ఉండేవాడు. ఇటీవల రూ.5 లక్షల కట్నం ఇస్తేనే పెళ్లి చేసుకుంటానని వేధింపులకు గురిచేశాడు. రెండు రోజుల క్రితం యువతి గ్రామంలో బతుకమ్మ ఆడేందుకు వెళ్లగా ఎందుకు వెళ్లావని ఆమెపై చేయి చేసుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి ఎస్సై పంచనామా నిర్వహించారు. మృతురాలి తల్లి విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.


వివరాలు సేకరిస్తున్న ఎస్సై రమేశ్

ఉద్యోగం పేరుతో రూ.లక్షలు వసూలు

బెల్లంపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విద్యాంజలి పోర్టర్‌ను ఆశజూపి కొందరు అమాయకులైన నిరుద్యోగుల నుంచి ఉద్యోగాల పేరుతో రూ.లక్షలు వసూలు చేస్తున్నారని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగం పెట్టించి ప్రతీనెల రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనాలు ఇప్పిస్తామని నమ్మబలుకుతున్నారన్నారు. పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరిపించి అక్రమ దందాకు తెరదించాలని, దోషులను శిక్షించాలని కోరారు. అసత్య ప్రచారాన్ని నిరుద్యోగులు పట్టించుకోవద్దన్నారు. ఎంసీపీఐ (యూ) బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి రమేశ్, నాయకులు అరవింద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

పార్టీ ఆదేశిస్తే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ

మంచిర్యాలటౌన్: బీజేపీ ఆదేశిస్తే రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో ఉంటానని మాజీ ఎమ్మెల్యే, ఆపార్టీ నాయకులు గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పార్టీ నాయకులను కలిశారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలతో పాటు, పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌కు చెందిన తనకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో మంచి సంబంధాలు ఉన్నాయని, ఈ ప్రాంత సమస్యలపై అవగాహన ఉందన్నారు. పార్టీ తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే ఈ ప్రాంత ప్రయోజనాల కోసం ప్రజలకు అండగా నిలుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు అర్జున్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముల్కల్ల మల్లారెడ్డి, కొయ్యల ఏమాజీ, నాయకులు తుల మధుసూదన్‌రావు, ఆకుల అశోక్ వర్దన్, రాము పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

విద్యారంగానికి బడ్జెట్‌లో తక్కువ ప్రాధాన్యత

మంచిర్యాలఅర్బన్: విద్య కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణలో భాగంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శామ్యూల్ అన్నారు. మంగళవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో తెలంగాణ విద్య పరిరక్షణ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామన్ స్కూల్ సిస్టం ప్రవేశపెట్టి పేద, ధనిక వర్గాలకు ఒకే చోట విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల, కళాశాలలు విశ్వవిద్యాలయాలను నియంత్రించాలని, నూతనంగా అనుమతులు ఇవ్వరాదంటూ గ్రామస్థాయిలో విద్యారంగానికి జరుగుతున్న అన్యాయం గురించి అవగాహన కల్పించి ప్రజలను చైతన్యవంతం చేయాలని నిర్ణయించారు. తెలంగాణ విద్యపరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మోతే జయకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, కమిటీ సభ్యులు జాకీర్, నాగలక్ష్మి, శ్రీమన్నారాయణ, కొండయ్య, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు లాల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శామ్యూల్

రాష్ట్రస్థాయి పోటీలకు బయలుదేరిన క్రీడాకారులు


రాష్ట్రస్థాయికి ఎంపికైన జట్లు

ఆసిఫాబాద్‌రూరల్: రంగారెడ్డి జిల్లాలో ఈనెల 9 నుంచి 11 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన మహిళ, పురుష జట్లు మంగళవారం బయలుదేరినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేశ్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జోనల్ స్థాయి పోటీలలో ప్రతిభ కనబర్చిన సీనియర్ మహిళ, పురుష జట్లకు ఈ నెల 6 నుంచి 8 వరకు జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో శిక్షణ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు అరవింద్, విష్ణు, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

జైతుగూడను సందర్శించిన కేంద్ర బృందం

దండేపల్లి: మండలంలోని జైతుగూడ గ్రామాన్ని వైద్య ఆరోగ్యశాఖ కేంద్ర బృందం సభ్యులు మంగళవారం సందర్శించారు. గ్రామంలోని ప్రజల ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. మలేరియా, డెంగీ, ఫైలేరియా వంటి వ్యాధులు ఉన్నాయా అని ప్రజలు, తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

తాంసి: భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామానికి చెందిన సహకార సంఘం కార్యదర్శి కర్నేవార్ గణేశ్ (50) ఈనెల 4న ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్ నుంచి వస్తుండగా ఖోడద్, హస్నాపూర్ గ్రామాల మధ్య అంతరాష్ట్ర రహదారిపై కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు.


కర్నేవార్ గణేశ్ (ఫైల్)

మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య

చెన్నూర్‌రూరల్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన అల్లంపల్లి పోచన్న (38)కు పదిహేనేళ్ల క్రితం మహారాష్ట్రకు చెందిన స్వరూపతో వివాహమైంది. ఏళ్లు గడుస్తున్నా పిల్లలు పుట్టకపోవడంతో మనస్తాపంతో మద్యానికి బానిసయ్యాడు. గతంలో కూడా రెండుసార్లు ఆత్మహత్యకు యత్నించాడు. సోమవారం మద్యం మత్తులో ఇంటినుంచి బయటకు వెళ్లి పురుగుల మందు తాగాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో మంగళవారం ఉదయం పొలానికి వెళ్లిచూడగా మృతి చెంది ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

జీవితంపై విరక్తితో ..

మందమర్రిరూరల్: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. యాపల్ ప్రాంతానికి చెందిన మామిడాల తిరుపతి (32)కి గతంలో జరిగిన ఓ ప్రమాదంలో కాలు విరిగింది. నొప్పి కారణంగా ఏపనీ చేయలేకపోతున్నాడు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఇంటి వరండాలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

8 టన్నుల నల్లబెల్లం పట్టివేత


పట్టుకున్న బెల్లంతో అధికారులు

పెంబి: ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రానికి చెందిన గుగ్లావత్ రాజేందర్ గోదాంలో తనిఖీ చేయగా ఎనిమిది టన్నుల నల్లబెల్లం, ఎనిమిది క్వింటాళ్ల పటిక పట్టుకున్నట్లు అబ్కారీ శాఖ జిల్లా అధికారి రజాక్ తెలిపారు. రాజేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐలు గంగారెడ్డి, లక్ష్మణ్‌రావు, ఎస్సైలు వసంత్‌రావు, గజేందర్, సిబ్బంది ఉన్నారు.

ప్రాణం తీసిన అతివేగం


హనుమవ్వ (ఫైల్)

సోన్: డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా కారు నడిపి మహిళ మృతికి కారణమైన సంఘటన గంజాల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...నిజామాబాద్ జిల్లా మెండోర మండలం వెల్గటూర్ గ్రామానికి చెందిన హనుమవ్వ (48) ప్రస్తుతం సోన్ మండలం గంజాల్‌లో తన చెల్లితో కలిసి ఉంటూ గేదెలను మేపుకుంటూ జీవనం సాగిస్తోంది. మంగళవారం 44వ జాతీయ రహదారి పక్కన గేదెలను మేపుతుండగా ఆర్మూర్ నుంచి నిర్మల్ వస్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై భూమేశ్వర్ తెలిపారు.

ప్రాణం తీసిన చేపల వేట

- విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


సంతోష్ మృతదేహం

సారంగపూర్(నిర్మల్): విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం మాడెపల్లికి చెందిన గెడం సంతోష్ (26) స్వర్ణ గ్రామానికి చెందిన బోడకుంటి రాజేశ్వర్ అనే రైతువద్ద పాలేరుగా పనిచేస్తున్నాడు. అప్పుడప్పుడు చేను సమీపంలోని స్వర్ణ వాగులో విద్యుత్ సాయంతో చేపలు పట్టేవాడు. సోమవారం చేనుకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన గుజ్జ పెద్ద ముత్యం అనే రైతు తన చేను వద్దకు వెళ్లి చూసేసరికి సంతోష్ మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. చేపలు పట్టే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి మృతిచెంది ఉండవచ్చని ఎస్సై తెలిపారు. మృతుని తండ్రి అర్జున్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం'

జన్నారం: రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. హర్యానాలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ గెలుపుపట్ల మంగళవారం మండల కేంద్రంలో సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పాలనలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విఫలమయ్యాయన్నారు. వచ్చే ఎన్నికలలో ప్రజలు ప్రత్యామ్నాయమైన బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. 2028 నాటికి బీజేపీ తెలంగాణలో రాజకీయ శక్తిగా ఎదిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుండవరపు మధుసూదన్‌రావు, జిల్లా కార్యదర్శి శంకరయ్య, ప్రధాన కార్యదర్శి రమేశ్ గౌడ్, నాయకులు దేవేందర్, జగన్, ప్రవీణ్, చందు, వీరాచారి, సూర్యం, తిరుపతి, గోపాల్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.


సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్స్ పోటీలకు ఆహ్వానం

మంచిర్యాలక్రైం: పోలీస్ అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 21న విద్యార్థులు, యువత, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు, ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిం పోటీలకు ఆహ్వానం పలుకుతున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న పోలీస్ ఫ్లాగ్‌డే సందర్భంగా పోలీస్ శాఖకు రిలేటెడ్ అంశాల మీద పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని ఆసక్తి కలవారు పోలీసుల త్యాగాలు, విధుల్లో చూపించిన ప్రతిభను తెలిపే విధంగా తీసిన 3 ఫొటోలు, మూడు నిమిషాల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈ నెల 20లోగా కమిషనరేట్ కార్యాలయంలోని నక్సల్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ఎన్ఐబీ) ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో అందజేయాలన్నారు. కమిషనరేట్ స్థాయిలో ఎంపిక చేయబడిన మూడు షార్ట్ ఫిలింలు, ఫొటోలను రాష్ట్రస్థాయి పోటీల ఎంపికకోసం డీజీపీ కార్యాలయం హైదరాబాద్‌కు పంపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8712656596, 8712656587 నంబర్లలో సంప్రదించాలన్నారు.

భీం వర్ధంతికి పూర్తిస్థాయి ఏర్పాట్లు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

ఉట్నూర్‌రూరల్: జోడేఘాట్‌లో ఈ నెల 17న నిర్వహించనున్న కుమురంభీం వర్ధంతికి పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నామని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి వర్ధంతికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీల సంక్షేమం కోసం పోరాడిన కుమురం భీం వర్ధంతిని ఘనంగా నిర్వహించాలన్నారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించాలన్నారు.

ఆటో, బైక్ ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

భైంసారూరల్/భైంసాటౌన్: పట్టణ శివారులోని హరియాలీ పెట్రోల్ పంప్ వద్ద భైంసా–బాసర రహదారిపై మంగళవారం సాయంత్రం ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడితో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న దాదాపు 15 మందికి గాయాలయ్యాయి. మిర్జాపూర్‌కు చెందిన వ్యవసాయ కూలీలు సోయా పంట కోతల కోసం ఆటోలో బిద్రెల్లికి వెళ్లి వస్తుండగా భైంసా వైపు నుంచి దేగాంకు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. ఆటో బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న గంగాధర్‌తో పాటు ద్విచక్ర వాహనదారుడు ఉత్తమ్‌కు తీవ్రంగా, మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రిలో సిబ్బంది లేక ఇబ్బంది..!

రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను డ్యూటీ డాక్టర్ పరీక్షించి వైద్య సేవలందించగా గాయాలకు డ్రెస్సింగ్ చేసే సిబ్బంది లేకపోవడంతో బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులు గాయాలతో విలవిలలాడుతుంటే కనీసం పట్టించుకోవడం లేదని వాపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని వారిని సముదాయించారు.